క్లుప్తంగా

పాఠశాలకు కంప్యూటర్ వితరణ



కంప్యూటర్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

శింగనమల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 2004–2005 విద్యార్థులు కంప్యూటర్ వితరణ చేశారు. మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఎంఈఓలు నరసింహరాజు, శివప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మకు పూర్వ విద్యార్థులు కంప్యూటర్ అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సేవాభావంతో ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్స్యకారుల వాగ్వావాదం



పోలీస్‌స్టేషన్ ముందు గుమికూడిన మత్స్యకారులు

పెద్దపప్పూరు: కమిటీ తరపున చేపలు పడతామని కొందరు.. మా గ్రామం చెంతన ఉన్న ప్రాజెక్టులో తామెందుకు చేపలు పట్టుకోకూడదని మరికొందరు మంగళవారం చాగల్లు ప్రాజెక్టు చెంతన వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి ఎస్‌ఐ గౌస్‌బాషా ఇరువర్గాల వారిని స్టేషన్‌కు పిలిపించి మత్స్యశాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి విషయం వివరించారు. రెండురోజుల్లో ప్రాజెక్టు చెంతకు వచ్చి సమస్య పరిష్కరిస్తామని మత్స్యశాఖ అధికారులు తెలిపారు. అంతవరకూ ప్రాజెక్టులోకి ఎవ్వరూ చేపలవేటకు వెళ్లకూడదని ఇరువర్గాలను హెచ్చరించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గడ్డంవారిపల్లి చెరువుకు చేరిన కృష్ణాజలాలు



చెరువుకు నీరు వెళ్తున్న దృశ్యం

యల్లనూరు: వైఎస్సార్ జిల్లా గండికోట రిజర్వాయర్ నుంచి పాలూరు పంప్‌హౌస్‌కు అక్కడ నుంచి యల్లనూరు చెరువుకు అక్కడ నుంచి గడ్డంవారిపల్లి చెరువుకు కృష్ణా జలాలను అధికారులు విడుదల చేశారు. చెరువుకు సకాలంలో నీరు రావడంతో పంటలను పండించుకోవచ్చని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. చెరువులో నీరు ఉంటే బోరుబావుల్లో నీటిమట్టం పెరుగుతుందన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో కోచ్

తాడిపత్రి అర్బన్: ఆగ్రాలో జరిగే జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు తాడిపత్రికి చెందిన క్రీడాకారుడు ఎంపికైనట్లు తైక్వాండో కోచ్ సాయిబాబా మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 18న విజయనగరంలోని రాజీవ్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్, సీనియర్ తైక్వాండో పోటీల్లో తాడిపత్రికి చెందిన క్రీడాకారులు రాహుల్, అనిల్‌శ్రీనివాస్, శివ, గోవిందు, రోహిత్, అనిల్‌లు పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో జూనియర్ విభాగంలో రోహిత్ రజత పతకం సాధించి సెప్టెంబర్ నెలలో ఆగ్రాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు కోచ్ తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం చిరంజీవి యువత జిల్లా అధ్యక్షుడు పాటిల్ సురేష్ రాయల్, రామ్‌చరణ్ యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బోయగడ్డ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో చిరంజీవి యువత, చిరంజీవి అభిమాన సంఘం నాయకులు వెంకటేష్, నాగప్ప, నాగయ్య, దనుంజయ, పుల్లయ్య,వెంకట పతి నాయుడు, దుర్గా ప్రసాద్, ఓబులేసు, గంగాధర్, రంగనాయకులు, మురళీ నాయక్,ఫిరోజ్ నాయక్, శ్రీతేజ, షేక్షావలి, హరి, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

ముంచెత్తిన వర్షాలు

- పొంగి పొర్లిన వాగులు వంకలు
- నీట మునిగిన పంటపొలాలు
- స్తంభించిన రాకపోకలు



గుంతకల్లు మండలం కొంగనపల్లి రహదారిపై పారుతున్న వర్షపునీరు



పామిడి పెన్నానదిలో వరదనీటి ప్రవాహ దృశ్యం

గుంతకల్లు రూరల్/గుత్తి/గుత్తి రూరల్/పామిడి/తాడిపత్రి రూరల్/పెద్దవడుగూరు/పెద్దపప్పూరు/శింగనమల/గార్లదిన్నె: గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో సోమవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి, చెరువులు, కుంటలు నిండుకుండలా మారి జలకళను సంతరించుకున్నాయి. అలాగే పంట పొలాలు నీట మునగడంతో పలువురు రైతులు తీవ్రంగా నష్టపోయారు.

- గుంతకల్లు మండలంలోని కొంగనపల్లి, ఓబుళాపురం గ్రామాల మధ్యనున్న రహదారి, నాగసముద్రం రహదారి, కదిరిపల్లి రహదారులపై వర్షపు నీరు పొంగి పొర్లడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కొంగనపల్లి వంకకు వైటీ చెరువు కేవలం 2 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉండటంతో వంకనీటిలో ఎదురు వచ్చిన చేపలను కొంగనపల్లి, శంకరబండ ప్రజలు పట్టారు
- గుత్తిలోని ఫారెస్టు కార్యాలయం, వెటర్నరీ ఆసుపత్రి, ఎంఎస్ ఫుట్‌బాల్ క్రీడామైదానం, ఎల్ఎం ఎయిడెడ్ పాఠశాల ఆవరణ భారీ వర్షాల నేపథ్యలో కుంటలను తలపిస్తున్నాయి. భారీ వర్షానికి తోడు ఈదురు గాలులు వీయడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మండలంలోని కరిడికొండ, బసినేపల్లి, బాచుపల్లి, వన్నేదొడ్డి, ఊబిచెర్ల, ధర్మాపురం, యంగన్నపల్లి, లచ్చానుపల్లి గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. లచ్చానుపల్లి శివారులో కొంగనపల్లి వాగు ఉధృతంగా ప్రవహించింది. రోడ్డుపై నుంచి నీరు ప్రవహించడంతో గుత్తి-కసాపురం మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. గుంతకల్లు నుంచి గుత్తి వైపునకు వస్తున్న తుఫాన్ వాహనం శ్రీపురం గ్రామ శివారులో అదుపుతప్పి కల్వర్టుపై నుంచి నీళ్లలోకి పడిపోయింది. స్థానికులు వాహనంలో నుంచి డ్రైవర్‌ను బయటకు తీయడంతో పెద్ద ప్రమాదం తప్పింది.
- పామిడి మండలంలోని పెన్నానదిలో వరదనీరు పోటెత్తింది. స్థానిక అనంతపురం బీసీసీ రోడ్డు వద్ద వంక పొంగిపొర్లింది. వర్షాలకు అనుంపల్లి-ఇమాంపురం గ్రామాల నడుమ వంతెన దెబ్బతింది. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలు స్థంభించిపోయాయి. అలాగే ఖాదర్‌పేటలో వంక ప్రవాహంతో ప్రజల రాకపోకలకు ఫీట్లు చేయాల్సి వచ్చింది.
- తాడిపత్రి పట్టణంలోని పప్పూరు రోడ్డులో దిగువ ప్రాంతంలోని మోడల్ స్కూలు, బండల పాలీసు యునిట్లు జలమయ్యాయి. ఎగువన కురిసిన వర్షానికి గుమ్మ వంక ఉధృతంగా ప్రవహించింది. కోమలి వద్ద గల వంకపై వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.
- పెద్దవడుగూరు సమీపంలోని పందుల వాగు, పెద్దవంక , చిన్నవంక, పీతల కాలువ, మరువ వంక వర్షపునీటితో పోటెత్తాయి. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. వర్షం నీటి ప్రవాహానికి చిన్నవడుగూరు వద్ద కాజ్‌వే, పి.వీరన్నపల్లి వద్ద పెద్దవంకపై రహదారి పూర్తిగా ధ్వసంమైది. దీంతో రాకపోకలు ఆగిపోయాయి. లక్ష్మంపల్లి జి.వెంకటాంపల్లి, మిడుతూరు, గుత్తిఅనంతపురం,పెద్దవడుగూరు. విరుపాపురం, ఆవులాంపల్లి తదితర గ్రామాలల్లోని కొర్ర, పత్తి, జొన్న, కంది పంట పొలాలు నీట మునిగాయి. లక్ష్మంపల్లి జెడ్పీ పాఠశాల ఆవరణలోకి వర్షం నీరు ప్రవేశంచడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.
- పెద్దపప్పూరు మండలంలోని నామనాంకపల్లి, నారాపురం, సోమనపల్లి, అత్తిరాలదిన్నె వంకలు జోరుగా ప్రవహించాయి. తాడిపత్రి, యాడికి ప్రాంతాలకు నాటుగు గంటల పాటు రాకపోకలు స్తంభిచాయి.
- శింగనమల మండలంలోని పెన్నానది ఉధృతంగా ప్రవహించింది. తరిమెల గ్రామం సమీపంలో నిర్మించిన బ్రిడ్జి వద్ద భారీగా నీరు పారింది.
- గార్లదిన్నె మండల వ్యాప్తంగా భారీ వర్షాలకు మొక్కజొన్న 43 ఎకరాలు, వరి 23 ఎకరాలు, వేరుశనగ 13 ఎకరాలు కంది 15 ఎకరాల్లో నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు అంచనాలు వేశారు. అనంతపురము వ్యవ సాయ శాఖ ఏడీ రవి, ఏఓ సోమశేఖర్ దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అలాగే మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూ ల్, ఎంపీడీఓ కార్యాలయం,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, యూనియన్ బ్యాంకు వద్ద ఈదురు గాలులకు పెద్ద చెట్లు నేల కూలాయి. పొలాల్లో విద్యుత్ స్తంబాలు సైతం విరిగిపోయాయి.

వర్షపాతం వివరాలు ఇలా..

మండలం	మిల్లీమీటర్లలో
గార్లదిన్నె	126
పామిడి	65.4
గుత్తి	55.6
తాడిపత్రి	50.4
పెద్దవడగూరు	52.04
గుంతకల్లు	42.2
పెద్దపప్పూరు	37.2
శింగనమల	35.6



గార్లదిన్నె జిల్లా పరిషత్ హైస్కూల్ గేట్ వద్ద నేల కూలిన చెట్టు



శింగనమల మండలం తరిమెల వద్ద పారుతున్న పెన్నానది



పెద్దవడుగూరులో నీట మునిగిన పత్తి పొలాలు



పెద్దపప్పూరు మండలం నామనాంకపల్లి వద్ద పారుతున్న వంక

అధైర్యపడకండి.. అండగా ఉంటా



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి

పామిడి: అధైర్య పడకండి...అండగా ఉంటానంటూ...మృతుడు గంధవీటి సత్యనారాయణరెడ్డి కుటుంబసభ్యులకు గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి భరోసా ఇచ్చారు. మంగళవారం కండ్లపల్లిలో నిర్వహించిన సత్యనారాయణరెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్న ఆయన మృతుడి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. సత్యనారాయణరెడ్డి మృతికి పార్టీకి తీరనిలోటన్నారు. అలాగే ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ వీరాంజనేయులు నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే నారాయణరెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, మాజీ సర్పంచ్ బయపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

శింగనమల: మండలంలోని సలకంచెరువు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు దేవదాయ శాఖకు చెందిన భూముల్లో అధికారుల అనుమతి లేకుండా దౌర్జన్యంగా బోర్లు వేశారని, సర్పంచ్ ఆదినారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహులు, రైతులు కలెక్టర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రీడల్లోనూ రాణించాలి

గుంతకల్లు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎస్‌జేపీ హైస్కూల్‌లో ఆర్టీటీ ఆధ్వర్యంలో మండల హైస్కూల్ లెవల్ అథ్లెటిక్ మీట్ నిర్వహించారు. ఈ మీట్‌లో దాదాపు 13 ప్రభుత్వ హైస్కూల్ బాలికల జట్లు పాల్గొన్నాయి. విద్యార్థులకు రన్నింగ్, హైజంప్, షార్‌పుట్ తదితర విభాగాల్లో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీటీ ఆర్డీ కృష్ణవేణి, ఏటీఎల్ వరకుమార్, హెచ్ఎం భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన హక్కులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్

పామిడి: గిరిజనులు చట్టపరమైన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం జిల్లా గిరిజన సంక్షేమాధికారి, సెక్రటరీ, సివిల్ జడ్జి జీ శివప్రసాద్ సూచించారు. మంగళవారం మండలంలోని రామగిరి దిగువతండా గ్రామంలో అనంతపురం జిల్లా న్యాయ సేవల అథారిటీ, జిల్లా వైద్య ఆరోగ్యం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. ఎస్ఏఎల్ఎస్ న్యాయపరమైన గిరిజనుల హక్కులను గిరిజన మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రభుత్వం గిరిజనుల అభ్యున్నతి కోసం రూపొందించిన పలు పథకాలపై ఆయన అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన వైద్య శిబిరంలో ఎద్దులపల్లి వైద్యాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు వైద్యసేవలతో పాటు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్వతి బద్రినాయక్, ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, ఈఓఆర్డీ శశికళ, వైద్య, ఆరోగ్య, ఆశా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

యాడికి/గార్లదిన్నె/పామిడి/బుక్కరాయసముద్రం: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ప్రపంచ దోమల దినోత్సవం సంద ర్భంగా యాడికిలో ఉన్నత పాఠశాల విద్యార్థులు, రాయలచెరువు ఆస్పత్రి సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అలాగే గార్లదిన్నె మండలంలోని మర్తాడులో యర్రగుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వ హించారు. వైద్యులు దిలీప్‌కుమార్, గౌతమి, హసీన, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు. పామిడిలో ఎద్దులపల్లి వైద్యాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి వినయ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీరామ్‌రెడ్డి, హెల్త్ అసిసెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే బుక్కరాయసముద్రంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ స్వాతి లక్ష్మి , సీహెచ్ఓ మోహన్‌రావు, పీహెచ్ఎన్ చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

23న గ్రామసభలు

పుట్లూరు: మండలంలో ఈ నెల 23న 2024–2025 సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనుల ఎంపిక కోసం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి మంగళవారం తెలిపారు. గ్రామ సభల్లో ఉపాది కూలీల హక్కుల గురించి అవగాహన కల్పించడంతో పాటు గతంలో మంజూరై కొన సాగుతున్న పనుల గురించి వివరిస్తామన్నారు. అలాగే 2024–2025లో చేపట్టాల్సిన పనులను ఎంపిక చేసి మంజూరు కోసం పంపుతామన్నారు. సమావేశానికి అధికారులు, కూలీలు, రైతులు, గ్రామస్తులు హాజరు కావాలని ఆయన కోరారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



రైల్వే ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు, వైద్యులు

గుంతకల్లు/గుత్తి: కలకత్తాలో ట్రైనీ డాక్టర్‌పై ఆత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి కే.ప్రభాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం గుంతకల్లులోని రైల్వే డివిజనల్ ఆస్పత్రి వద్ద ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో ఆస్పత్రి వైద్యులతో కలిసి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు మల్లికార్జున, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే వైద్యురాలి హత్యను నిరసిస్తూ గుత్తి పట్టణంలో ఏఐటీయూసీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆటో డ్రైవర్లు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు నజీర్, అమరేశ్వర్, మహ్మద్ రసూల్, సురేష్, లక్ష్మణ్, శ్రీకాంత్, కర్ణ తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

తాడిపత్రి: మండలంలోని పలు ప్రాంతాల్లో అక్రమంగా విద్యుత్‌ను ఉపయోగిస్తున్న వారి గృహాలపై మంగళవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఏఈ పీరా ఆధ్వర్యంలో బృందం తాడిపత్రి మండలంలో పర్యటించింది. అందులో భాగంగా పలు గ్రామాల్లో అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్న లబ్ధిదారులను గుర్తించారు. అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్న లబ్ధిదారులకు రూ. 2 లక్షల వరకు జరిమానా విధించినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.

వైభవంగా లక్ష నాగవల్లి దళార్చన



దళార్చనలో పాల్గొన్న భక్తులు

గుంతకల్లు: స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం ఆవోపా ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి విగ్రహానికి లక్ష నాగవల్లి దళార్చన (తమపాకులతో) కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆవోపా పట్టణ అధ్యక్షుడు చెన్నకేశవులు, కార్యదర్శి రాము. కోశధికారి రఘు, సభ్యులు వెంకట్, హరి. రాజేంద్ర, రాకేష్, మహిళలు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలపై అవగాహన

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ ఇండియన్ కాంక్రీట్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థి విభాగం, ఓన్‌డీఎల్ఐ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో కాంక్రీట్ మిక్స్ డిజైన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ చిన్న వెంకటరెడ్డి మాట్లాడుతూ నిర్మాణ కట్టడాల నాణ్యతలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ రఘుబాబు, లక్ష్మీశిరీష, ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, టీపీఓ రంజిత్ రెడ్డి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ చైతన్య కిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడిపై దాడి

పెద్దవడుగూరు: మండలంలోని చిన్నవడుగూరు గ్రామంలో మంగళవారం రాత్రి వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు సూర్యనారాయణరెడ్డిపై టీడీపీ మద్దతుదారులు దాడి చేశారని పోలీసులు తెలిపారు. పాతకక్షల కారణంగా దాడికి పాల్పడ్డారన్నారు. తీవ్రంగా గాయపడిన సూర్యనారాయణరెడ్డిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. దాడికి పాల్పడ్డ టీడీపీ వర్గీయులైన చిరంజీవిరెడ్డి, భాస్కర్‌తో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

తాడిపత్రి అర్బన్: స్థానిక ఏపీ మోడల్ పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్లేట్లను పంపిణీ చేశారు. పాఠశాలలోని 1400 మంది విద్యార్థులకు ఉచితంగా రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ సాదు గోపాలకృష్ణ చేతుల మీదుగా ప్లేట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ దాదాపుగా 25 పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచితంగా ప్లేట్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు నాగరాజు, రామగోవిందు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు సుబ్రమణ్యం, సభ్యులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు పక్కాగా చేపట్టండి



మాట్లాడుతున్న ఈఆర్ఓ శిరీష

తాడిపత్రి రూరల్: ఓటరు నమోదును అధికారులు, బీఎల్ఓలు పక్కాగా చేపట్టాలని ఈఆర్ఓ శిరీష సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం స్పెషల్ సమ్మరీ రివిజన్–25 కార్యక్రమంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కొత్తగా ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు గురించి ప్రజల నుంచి దరఖాస్తులను తీసుకోవాలన్నారు. ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 21 వరకూ ఇంటింటికీ బీఎల్ఓలు వెళ్లాలన్నారు. ఎన్నికల కమిషన్‌కు సంబంధించిన యాప్‌ల ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రామ్మోహన్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆంజనేయ ప్రసాద్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ నాగేంద్ర ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గతంలో ఎన్నికల విధులను నిర్వహించినందుకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం ఇప్పించాలని ఈఆర్ఓకు బీఎల్ఓలు వినతి పత్రం అందజేశారు.

సంక్షిప్త వార్తలు

ఘనంగా రాఘవేంద్రస్వామి పూర్వారాధన

తాడిపత్రి అర్బన్/గుత్తి రూరల్: తాడిపత్రి పట్టణంలోని సత్యనారాయణస్వామి ఆలయం సమీపంలోని రాఘవేంద్రస్వామి ఆలయంలో గురువారం 353వ ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. రాత్రి 7గంటలకు స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. అలాగే గుత్తి మండలం ఇసురాళ్లపల్లిలోని ఆనందాశ్రమంలో రాఘవేంద్ర స్వామి 86వ ఆరాధనోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

గుంతకల్లుటౌన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసారచన, వక్తృత్వపు, చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్.భవాని, ఆర్టీఓ శ్రీనివాసరెడ్డి బహుమతులు అందజేశారు. మంగళవారం డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్, డాక్టర్ అర్షద్, మేస్త్రీ దొడ్డప్ప, మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూడిక తొలగించండి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని గుంతబావి వద్ద నున్న రైల్ అండర్ బ్రిడ్జి లో పూడికను తీసివేయించి రాకపోకలు కొనసాగేలా చూడాలని కమిషనర్ వెంకటరమణయ్య శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఉదయం 22వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహకం

బుక్కరాయసముద్రం: ఉద్యాన పంటలు సాగుకు ప్రోత్సాహకం అందిస్తున్నట్లు మండల ఉద్యాన శాఖ అధికారి శైలజా తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉద్యాన శాఖ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎంఐడీహెచ్ పథకంలో అమలు అవుతున్న నూరేడు, మామిడి, చీని, అంజూర, డ్రాగన్ ఫ్రూట్స్, వంటి పంటల సాగు చేస్తున్న రైతులకు 40 శాతం రాయితీ ఇస్తామన్నారు. అదే విధంగా బంతి, మల్లె, చామంతి, సాగు చేస్తున్న రైతులకు 5 ఎకరాల వరకూ రైతుకు రాయితీ ఉంటుందన్నారు. దానిమ్మ పంట చేస్తున్న రైతులకు పంట చుట్టూ నెట్ వేసుకుంటే హెక్టారుకు రూ.33,000 ఇస్తామన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

పామిడి: పట్టణంలోని వాసవీ కళ్యాణ మండపంలో మంగళవారం పామిడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంగుళూరు శంకర కంటి ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. శిబిరంలో వైద్య నిపుణుడు జగదీష్ 150 మందికి కంటి పరీక్షలు చేశారు. 62 మందిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయుష్ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతి నాయుడు, క్లబ్ ప్రెసిడెంట్ రఘువీర్, ఉపాధ్యక్షుడు పట్రా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి జయరామ్‌రావు, వైద్యులు పాల్గొన్నారు.

'అన్నీ అసత్య ఆరోపణలే'

పామిడి: అంకితభావంతో విధులు నిర్వర్తిస్తున్న పామిడి కమ్యూనిటీ ఆసుపత్రి సిబ్బందిపై ఎలాంటి ఆధారాలు లేకుండా కొందరు కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదులన్నీ అసత్య ఆరోపణలే అని వైద్యాధికారి శివకార్తీక్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసుపత్రికి వైద్యసేవలకు వచ్చే ప్రజల నుంచి వైద్యపరంగా ఎలాంటి ఫిర్యాదులు లేవన్నారు. కొందరు తమవారిని కాంట్రాక్ట్ కార్మికులుగా చేర్చుకోవాలన్న ఒత్తిళ్లకు తలొగ్గక పోవడమే ఈ ఆరోపణలకు ప్రధాన కారణమన్నారు. కార్యక్రమంలో వైద్యులు మహేష్, కమలాకర్ పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో తమ్ముళ్ల హల్‌చల్



అధికారులపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

గుంతకల్లు రూరల్: టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మొట్టమొదట నిర్వహించిన సర్వసభ్యసమావేశంలో టీడీపీ కార్యకర్తలు హల్‌చల్ చేశారు. సభలోకి టీడీపీ కార్యకర్తలు, నాయకులు భారీగా చొచ్చుకురావడం, ప్రజాప్రతినిధులకు, అధికారులకు కేటాయించిన సీట్లలో తిష్టవేశారు. దీంతో కొంతమంది ఉద్యోగులు సమావేశం హాలు బయట నిల్చోవాల్సి వచ్చింది. టీడీపీ నాయకులు ఒకరి తరువాత ఒకరు సమస్యలపై అధికారులను నిలదీస్తుండటంతో సభ్యులకు మాట్లాడే అవకాశం కూడా లేకుండా పోయింది. దీంతో ప్రజల పక్షాన సభలో సమస్యలపై ప్రశ్నించాల్సిన ప్రజాప్రతినిధులు కేవలం కుర్చీలకే పరిమితమై ప్రేక్షక పాత్ర వహించారు. ఉదయం 10.30 గంటలకు సర్వసభ్యసమావేశం ప్రారంభం కానుండగా సభ్యులందరూ 10 గంటలకే కార్యాలయం వద్దకు చేరుకుని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం రాక కోసం ఎదురు చూశారు. మధ్యాహ్నం 12.40 గంటలకు ఎమ్మెల్యే సమావేశానికి హాజరుకాగా ఎంపీపీ మాధవి అధ్యక్షతన సమావేశాన్ని ప్రారంభించేందుకు సిద్ధమైన ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి సభలో సభ్యులు, అధికారులు తప్ప ఎవరూ ఉండకూడదని, అందరూ బయటకు వెళ్లాలని సూచించారు. ఎంపీడీఓ మాటను ఏమాత్రం ఖాతరు చేయకుండా సభ్యులకు, అధికారులకు కేటాయించిన కుర్చీల్లో టీడీపీ కార్యకర్తలు ఆసీనులయ్యారు. కొంతమంది టీడీపీ నాయకులు మాత్రం ఏకంగా స్టేజీపై ఎమ్మెల్యే పక్కన ఖాళీగా ఉన్న కుర్చీల్లో కూర్చొని ప్రజాప్రతినిధుల్లా మారిపోయారు. సర్వసభ్య సమావేశం కాస్తా కార్యకర్తల సమావేశంగా మారిపోవడంతో సమావేశానికి హాజరైన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అసహనం వ్యక్తం చేశారు.

సమీక్ష పూర్తికాకుండానే ముగిసిన సమావేశం

సభ ప్రారంభం కాగానే ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆయా ప్రభుత్వ శాఖలపై చర్చ మొదలుపెట్టారు. ముందుగా నీటి సరఫరా, పంచాయతీ రాజ్ శాఖలపై సమీక్షించిన ఆయన మన మండలానికి డ్రైనేజీల నిర్వహణకు రూ.3 కోట్లు, గ్రామ పంచాయతీల అభివృద్ధికి రూ. 3 కోట్లు మంజూరయ్యాయని, ఆ నిధులను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తాగునీరు, గృహనిర్మాణం, వ్యవసాయం, ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్ శాఖ, విద్యుత్ వంటి శాఖలపై సమీక్ష నిర్వహించే సరికి సమయం 2 గంటలు దాటింది. మిగిలిన అంశాలపై సమీక్ష జరక్కుండానే సభ ముగిసింది. తహసీల్దార్ రమాదేవి, జెడ్పీటీసీ కదిరప్ప, అధికారులు పాల్గొన్నారు.